క్లుప్తంగా

కరాటేతో ఆత్మవిశ్వాసం


శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కమాండెంట్ వెంకటరాములు

సత్తుపల్లిటౌన్: విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ కరాటే శిక్షణ పొందటం ద్వారా ఆత్మ విశ్వాసం, శారీరక దారుఢ్యం పెరుగుతుందని బెటాలియన్ కమాండెంట్ వెంకటరాములు అన్నారు. సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నెలరోజుల పాటు సత్తుపల్లి లయన్స్ బుడో ఖాన్ కరాటే హెల్త్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కరాటే శిక్షణా తరగతులు శుక్రవారంతో ముగిశాయి. శిక్షణ పొందిన విద్యార్థులకు కమాండెంట్ సర్టిఫికెట్లు అందించి.. శిక్షణ ఇచ్చిన మాస్టర్ పిచ్చయ్యను అభినందించారు. కార్యక్రమంలో విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపాల్ పసుపులేటి నాగేశ్వరరావు, వెంకట్రావ్, సలీం, చైతన్య పాల్గొన్నారు.

చర్చి ఫాదర్ల సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న ఆదామ్ ఎలీషా

ఎర్రుపాలెం: మండలంలోని చర్చి ఫాదర్ల సమస్యల పరిష్కారానికి, సంఘం బలోపేతానికి కృషి చేస్తామని ఫాస్టర్స్ ఫెలోషిప్ మండల కమిటీ అధ్యక్షుడు కోట ఆదామ్ ఎలీషా తెలిపారు. శుక్రవారం మండలంలోని బుచ్చిరెడ్డిపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన ఫాదర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం సెక్రటరీ ఆహోరోను, సుధాకర్, మోహన్‌రావు, నవ్య, స్వామి పాల్గొన్నారు.

జీవితాలు బలి చేసుకోవద్దు..


కేసుపల్లి గ్రామంలో పర్యటిస్తున్న నాగేశ్వరరావు

ఏన్కూరు: మద్యం తాగి నిండు జీవితాలు బలి చేసుకోవద్దని నారాయణ, బసవమ్మ మెమోరియల్ ట్రస్ట్ స్థాపకుడు డాక్టర్ శెట్టిపల్లి నాగేశ్వరావు కోరారు. మండల పరిధిలోని కేసుపల్లి గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో సామాజిక సేవ కార్యక్రమంలో పాల్గొన్న యువకులను అభినందించారు. అనంతరం ఏన్కూరు జూనియర్ కళాశాలలోని క్రీడా మైదాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్సై బాదావత్ రవి కుమార్తో మాట్లాడారు. రాత్రి వేళ్లలో కళాశాల మైదానంలో కొంతమంది మద్యం తాగి సీసాలు పగులకొడుతున్నారని.. వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కోటేశ్వరావు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా లయన్స్‌క్లబ్


విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న డాక్టర్ కాపా మురళీకృష్ణ, డాక్టర్ చంద్రకళ దంపతులు

వైరా: నిరుపేదలు, నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా వైరా లయన్స్‌క్లబ్ పని చేస్తుందని లయన్స్ క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీ కృష్ణ అన్నారు. స్థానిక మురళీ కృష్ణ హాస్పిటల్ అధినేత్రి డాక్టర్ కాపా చంద్రకళ జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం చింతకాని మండలం కోమట్లగూడెం గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థిని లక్కిరెడ్డి అనూషకు ల్యాప్‌టాప్ అందించారు. వైరా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పెనుగొండ ఉపేందర్ రావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జీఎంటీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్యాంబాబు, ఆర్సీ ప్రభాకర్, డాక్టర్ చంద్రకళ, అబ్బూరి రమేష్, వెంకటేశ్వరరావు, రాంగోపాల్, వెంకటేష్, శ్రీనివాసరావు, అక్షిత్ పాల్గొన్నారు.

ఆర్థిక చేయూత


మిత్రుడి కుటుంబానికి నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

వైరా: వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1996–98 బ్యాచ్ ఇంటర్ చదివిన పూర్వ విద్యార్థులు తమ పూర్వ మిత్రుడు వాంకుడోత్ శ్రీనివాస్ భార్య అనారోగ్యంతో బాధ పడుతున్న విషయం తెలుసుకుని శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. పూర్వ మిత్రులు శ్రీనివాసరావు, కొండలరావు, అఫ్జల్, కృష్ణయ్య, శేషగిరి, రఫీ, సీతారాములు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఆగని అక్రమాలు..


ఆక్రమణలతో కుచించుకుపోయిన వంకరవాగు

వంకర వాగును మింగిన అక్రమార్కులు
- 300 ఎకరాలకు పైగా భూ కబ్జాలు
- సర్వే నిర్వహిస్తేనే.. బండారం బయటకు..
- వాగు ఉనికే కోల్పోవడంతో వేలాది ఎకరాల సాగునీటికి కటకట..

కల్లూరురూరల్: మండలంలోని వంకర వాగును భూ కబ్జాదారులు దర్జాగా ఆక్రమించి వాగు ఉనికి లేకుండా చేస్తున్నారు. కనకగిరి గుట్టల నుంచి కల్లూరు పెద్దచెరువు వరకు సుమారు 13 కిలోమీటర్ల దూరం నుంచి ప్రవహించే ఈ వాగు ఈ ప్రాంతలోని వేలాది ఎకరాల సాగు భూములకు వరప్రదాయనిగా ఉండేది. సుమారు 120 అడుగుల వెడల్పు, 30 అడుగుల లోతులో ఉండే ఈ వంకర వాగు రూపురేఖలు మారి నేడు చిన్న పిల్ల కాలువల సంతరించుకుంది. కనకగిరి అడవులు, గుట్టలలో పడే వర్షపు నీరు పులిగుండం ప్రాజెక్ట్ దాటుకొని కల్లూరు పెద్దచెరువుకు వరద ప్రవాహం చేరుకునేది. కల్లూరు అడవిలో ఒక్కరోజు వర్షం పడితే చాలు కల్లూరు పెద్దచెరువు ఒక్క రోజులో నిండిపోయేది. అదే విధంగా ఈ వరద నీరు పుల్లయ్య బంజరు వాగులు ప్రవహించి తల్లాడ మండలంలోని పలు చెరువులకు నీరు అందేవి.

ఆక్రమణలతో ఉనికి కోల్పోయిన వంకర వాగు..

వంకర వాగుకు ఇరువైపులా ఉన్న సారవంతమైన భూమిని అనేక మంది ఆక్రమించుకున్నారు. వాగుకు పక్కనే ఉన్న మట్టి దిబ్బలు, చిన్నచిన్న చెట్లను నరికివేసి ఆ భూమి మొత్తాన్ని కబ్జా చేశారు. అదే విధంగా రానురాను వాగు భూమితో పాటు వాగును కూడా అక్రమార్కులు క్రమంగా పూడ్చి వేసి చిన్న పిల్ల కాలువలా మార్చివేశారు. ఈ వాగుపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడం వల్ల


వంకర వాగు

ఇష్టారీతిన ఆక్రమించుకున్నారు. వంకర వాగు సంబంధించిన పరివాహక భూములు సుమారు 300 ఎకరాలకు పైగా భూమిని కబ్జాదారులు దర్జాగా ఆక్రమించుకున్నారు. జలవనరుల శాఖ అధికారాలు సమగ్ర సర్వే నిర్వహిస్తే అక్రమార్కుల బండారం బయటపడే అవకాశం ఉంది.

సాగుభూములకు నీటి కరువు..

వంకరవాగు ద్వారా వచ్చే నీటి ఆధారంగా కల్లూరు మండలంలోని పెద్దచెరువు, ఇటుకరాల చెరువు, నాగుల చెరువు, ఊరచెరువుతో పాటు పుల్లయ్యబంజరు వాగుకు సైతం ఈ నీటి ప్రవాహం వల్ల తల్లాడ మండలంలోని అనేక చెరువులు, కుంటలకు నీరు చేరేవి. వంకర వాగు కబ్జా వల్ల సుమారు 6వేల ఎకరాల సాగు భూములకు నీటి ఎద్దడి ఏర్పడింది.

కబ్జాలపై సమగ్ర భూ సర్వే చేపట్టాలి..

వంకర వాగు భూ కబ్జాలపై జలవనరుల శాఖ అధికారులు సమగ్ర భూ సర్వే నిర్వహించాలని రైతులు కోరుతున్నారు. సర్వ నిర్వహించి కబ్జా చేసిన భూములను స్వాధీనం చేసుకోవాలని, అదే విధంగా వంకర వాగుకు పూర్వ వైభవం తెచ్చే విధంగా కృషి చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి..



వంకర వాగు పరివాహక భూప్రాంతాన్ని ఆక్రమించిన అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి. కల్లూరు పెద్ద చెరువు నుంచి కనకగిరి గుట్టల వరకు గల ఈ వాగును అనేక మంది అక్రమంగా ఆక్రమించుకున్నారు. ఆ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోని.. వాగు పూర్వ వైభవం సంతరించుకునేలా చర్యలు తీసుకోవాలి.

– రంగు లక్ష్మణరావు, రైతు, పుల్లయ్యబంజరు

సర్వే నిర్వహించాలి..



వంకర వాగును పరివాహ భూములను సర్వే నిర్వహించాలి. కనకగిరి అడవుల నుంచి ప్రవహించే ఈ వాగు రాను రాను కుచించుకుపోయింది. కబ్జాదారులు వాగు పక్కన ఉన్న భూములతో పాటు వాగు కూడా ఆక్రమించుకొని వాగు ఉనికి లేకుండా చేస్తున్నారు. వంకరవాగు వల్ల వందలాది ఎకరాల భూములకు సాగునీరు అందుతుంది.

– కర్నాటి పిచ్చిరెడ్డి, రైతు, కప్పలబంధం

బయ్యారం ఉక్కుతో ఉద్యోగ, ఉపాధి


మాట్లాడుతున్న మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వర్లు

కారేపల్లి: భయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటుతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ఏజేన్సీ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం కారేపల్లిలో జరిగిన కామేపల్లి, కారేపల్లి మండల కమిటీల సంయుక్త సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దశాబ్ధకాలం పాలించిన కేసీఆర్ ప్రజలమౌళిక సమస్యల పరిష్కారం చూపడంలో నిర్లక్ష్యం వహించడం మూలంగా ఓటమితో మూల్యం చెల్లించుకున్నారని విమర్శించారు. నూతన కాంగ్రెస్ ప్రభుత్వం మాటలతో కాలం గడపకుండా ప్రజా సమస్యలు, అభివృద్ధి, హామీల అమలుపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. జిల్లాకు సాగు, తాగునీరు అందించే సీతారామ ప్రాజెక్ట్ త్వరగా పూర్తి చేయాలని జిల్లా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. ఆంధ్రాలో కలిసిన ఏడు పంచాయతీలు తెలంగాణకు తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సూచించారు. కార్యక్రమంలో మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆవుల అశోక్, డివిజన్ కార్యదర్శి టి.ఝాన్సీ, మండల కార్యదర్శులు గుమ్మడి సందీప్, ఎన్వి.రాకేష్, నాయకులు తేజానాయక్, భాస్కర్, సత్తిరెడ్డి, సక్రు, బాలు, అనసూర్య, సరోజిని, రంగ్యా, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలి


జీలుగు విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారి రామ్మోహన్

వేంసూరు: రైతులు పంటల సాగులో రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి రామ్మోహన్ అన్నారు. శుక్రవారం మండలంలోని కేజీ మల్లెల సొసైటీ జీలుగు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పచ్చిరొట్ట సాగుతో భూసారం పెరగడంతో పాటు ఎరువుల వాడకం తగ్గి దిగుబడి పెరుతుందని తెలిపారు. విత్తనాల కొనుగోలులో రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ చెన్నారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు


మాట్లాడుతున్న సీఐ వెంకటేష్

ఏన్కూరు: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పెనుబల్లి సీఐ వెంకటేష్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషనలో శనివారం మండల విత్తన దుకాణాల డీలర్లతో నిర్వహించి సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు విత్తనాలు విక్రయిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. డీలర్లు రైతులకు ఎమ్మార్పీ ధరలకు విత్తనాలు విక్రయించి వారిక బిల్లులు ఇవ్వలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రవికుమార్, వ్యవసాయాధికారి నర్సింహారావు పాల్గొన్నారు.

అమరుల ఆశయాలను సాధించాలి


బాలస్వామి స్మారక స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న ప్రసాద్

చింతకాని: అమరవీరుల ఆశయాలను సాధించే దిశగా కార్యకర్తలు ముందుకు సాగాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని కొదుమూరు గ్రామంలో సీపీఐ సీనియర్ నాయకుడు, గ్రామ మాజీసర్పంచ్ నారపోగు బాలస్వామి వర్ధంతి సభను శుక్రవారం నిర్వహించి మాట్లాడారు. గ్రామంలో పార్టీ అభివృద్ధికి బాలస్వామి చేసిన సేవలను కొనియాడారు. బాలస్వామి స్మారక స్తూపం వద్ద ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు కొండపర్తి గోవింద రావు, మండల కార్యదర్శి పావులూరి మల్లిఖార్జున్ రావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పగిడిపల్లి ఏసు, జిల్లా కౌన్సిల్ సభ్యులు కూచిపూడి రవి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు అబ్బూరి మహేష్, నాయకులు పాతూరి వెంకటేశ్వర్లు, వేముల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకుతో ప్రాణానికే హానికరం


తల్లాడలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

తల్లాడ: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా తల్లాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం పొగాకుపై అవగాహన కల్పించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి రత్న మనోహర్ మాట్లాడుతూ.. గుట్కా నమిలిన, పొగ తాగిన కేన్సర్‌బారిన పడతారని హెచ్చరించారు. పొగాకు ఉత్పత్తిపై 25 రకాల జబ్బులు వస్తాయని తెలిపారు. ముఖ్యంగా పొగ తాగే వారితో పాటు పీల్చే వారికి కూడా ప్రమాదం అంతే స్థాయిలో ఉందన్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో పొగాకును నిషేదిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ భాస్కర్, సూపర్‌వైజర్ పెద్ద పుల్లయ్య, స్టాఫ్ నర్సు కళావతి, ల్యాబ్ టెక్నీషియన్ రెడ్డి, ఎఎన్‌ఎంలు జ్యోతి, పద్మావతి, అన్నపూర్ణ, శారద, పద్మ, సునీత, శిరీష, రాంబాయి, అరుణిమ పాల్గొన్నారు.

ఆలయంలో త్రిరాత్రి ఉత్సవాలు

సత్తుపల్లిరూరల్: అయ్యగారిపేటలో శ్రీభక్తాంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 1 నుంచి 3 వరకు హనుమత్ జయంతి త్రిరాత్రి ఉత్సవాలు నిర్వహించబతాయని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. 1న మంగళతోరణం, గణపతిపూజ, పంచామృతాభిషేకాలు, జలాభిషేకాలు, ఆకుపూజ, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించబతాయని తెలిపారు. 2న సామూహిక కుంకుమపూజలు, హోమ కార్యక్రమాలు, 3న సంధూరం, తమలపాకులతో అర్చన కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమం, గ్రామోత్సవం నిర్వహించబడుతుందని తెలిపారు.

108 కలశాలతో అభిషేకాలు..

పట్టణంలోని వేంసూరురోడ్ శ్రీమెట్టాంజనేయ స్వామి ఆలయంలో హనుమత్ జయంతి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామికి 108 కలశాలతో అభిషేకాలు, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు కాలినేని కాంతారావు, మందపాటి రవీందర్‌రెడ్డి, మల్లూరు అంకమరాజు పాల్గొన్నారు.

సైన్స్ సెక్షన్లు సద్వినియోగం చేసుకోవాలి

మధిర: మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్న సైన్స్ సెక్షన్లను విద్యార్థుల సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ ఏఎల్ఎన్ శాస్త్రి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. డిగ్రీ కళాశాలలో సైన్స్ సెక్షన్లు లేకపోవడం వల్ల ఈ ప్రాంత విద్యార్థులు సైన్స్ విద్య పొందేందుకు దూర ప్రాంతాలకు వెళుతున్నారని తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి డిగ్రీ కళాశాలలో బీఎస్సీ లైఫ్ సైన్స్, బీఎస్సీ ఫిజికల్ సైన్స్ అనే రెండు కొత్త కోర్సులు మంజూరైనట్లు పేర్కొన్నారు. బీఏ, బీకాం, బీఎస్సీ కంప్యూటర్ కోర్సులు, జనరల్ కోర్సులు విద్యార్థులకు పూర్తిగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ ప్రాంత విద్యార్థులు దోస్త్ అడ్మిషన్ తీసుకొని డిగ్రీ కళాశాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అడ్మిషన్ల సమాచారం కోసం దోస్త్ కోఆర్డినేటర్ జి.అరుణ 9441786508 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సీడీపీఓ కొండమ్మ సేవలు అభినందనీయం


సీడీపీఓ కొండమ్మ దంపతులను సన్మానిస్తున్న డీడబ్ల్యూఓ రాంగోపాల్‌రెడ్డి

సత్తుపల్లిటౌన్: స్త్రీ, శిశుసంక్షేమ శాఖలో 31 సంవత్సరాల పాటు వివాద రహితంగా.. అంకిత భావంతో సీడీపీఓ కొండమ్మ అందించిన సేవలు అభినందనీయమని జిల్లా సంక్షేమ అధికారి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. సత్తుపల్లి సీడీపీఓ కార్యాలయంలో శుక్రవారం ఉద్యోగ విరమణ పొందుతున్న సీడీపీఓ ఎ.కొండమ్మ, మత్తి శ్రీనివాసరావు దంపతులను ఆయన ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చండుగొండ, బూర్గంపాడ్ సీడీపీఓ సీహెచ్ నిర్మల జ్యోతి, ఎ.ప్రమీల, సూపర్‌వైజర్లు రాజ్యలక్ష్మి, మల్లీశ్వరి, మహాలక్ష్మి, భవాని, రమాదేవి, రజిని, కమల, సుజాత, గంగాజలం, అనురాధ, శ్రీనివాసరావు, ప్రసాద్, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పదవీ విరమణ.. సత్కారం

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు పీహెచ్‌సీలో ఎఫ్ఎన్‌ఓగా విధులు నిర్వర్తిస్తున్న కె.ధనలక్ష్మి శుక్రవారం పదవీ విరమణ చెందారు. డాక్టర్ వీర బాబు, సిబ్బంది ఆమెకు ఘనంగా సన్మానించారు. పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ సదాశివరావు, స్టాఫ్‌నర్స్ రోజా, హెల్త్ అసిస్టెంట్స్ సుధాకర్, వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్‌కు సన్మానం


తల్లాడ ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ ఇబ్రహీంను సన్మానిస్తున్న దృశ్యం

తల్లాడ: తల్లాడ బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేసి బదిలీపై ఖమ్మం మెయిన్ బ్రాంచ్‌కు వెళ్తున్న షేక్.ఇబ్రహీంను పలువురు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శుక్రవారం జరిగిన సభలో వైరా జెడ్పీటీసీ నంబూరి కనకదుర్గ, వైరా మాజీ మార్కెట్‌కమిటీ వైస్ చైర్మన్ దూపాటి భద్రరాజు, పలువురు వ్యాపారులు మాట్లాడారు. గత 22 నెలలుగా తల్లాడ బ్రాంచ్‌లో అంకిత భావంతో విధులు నిర్వహించి రైతులు, వినియోగారుల మన్ననలను పొందారన్నారు. కార్యక్రమంలో వ్యాపారులు దారా విష్ణు మోహన్ రావు, శ్రీనివాసరావు, లక్ష్మారెడ్డి, సుధాకర్, నాగేశ్వరరావు, ఆంజనేయులు, కృష్ణారెడ్డి, వెంకటేశ్వరరావు, నారాయణరెడ్డి, సీతారామిరెడ్డి, బ్యాంక్ సిబ్బంది, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్య సొసైటీ డైరెక్టర్ మృతికి పలువురి నివాళి


వెంకటేశ్వర్లు మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న నున్నా నాగేశ్వరరావు

వైరా: వైరా మత్స్య సహకార సొసైటీ డైరెక్టర్ కంకణాల వెంకటేశ్వర్లు శుక్రవారం మృతి చెందాడు. ఆయన గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చిన్నతనం నుంచి వామపక్ష భావాలు కలిగిన వెంకటేశ్వర్లు సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, సీపీఎం పార్టీల్లో పనిచేసి రెండేళ్ల క్రితం బీఆర్ఎస్‌లో చేరాడు. వెంకటేశ్వర్లు మృతి విషయం తెలుసుకున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు వెంకటేశ్వర్లు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ వైరా డివిజన్ కార్యదర్శి షేక్ ఖాసీమ్, సీపీఎం జిల్లా నాయకుడు బొంతు రాంబాబు, కృష్ణ, ఆనందరావు, ఆప్ జిల్లా అధ్యక్షుడు స్వర్ణ సుబ్బారావు, మాస్‌లైన్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు వెంకటేశ్వర్లు మృతికి సంతాపం ప్రకటించారు.

కారుణ్య మృతికి సీపీఎం నాయకులు నివాళి

కొణిజర్ల: ఇటీవల భద్రాచలం నర్సింగ్ కళాశాలలో అనుమానస్పదంగా మృతి చెందిన నర్సింగ్ విద్యార్థిని పగిడిపల్లి కారుణ్యకు సీపీఎం నాయకులు నివాళులు అర్పించారు. శుక్రవారం మండలంలోని సిద్దిక్‌నగర్ గ్రామంలో కారుణ్య కర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు భూక్యా వీరభద్రం, సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శి పగిడిపల్లి కాటయ్య, నాయకులు పగిడిపల్లి జయకుమార్, చెరుకుమల్లి మోహన్‌రావు, కృష్ణ, కరుణ, స్వతంత్రరావు, సుధాకర్, సురేష్ తదితరులు కారుణ్య చిత్రపటానికి పూల మాలలేసి నివాళులు అర్పించారు. కుటుంబానికి సీపీఎం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

నేడు హనుమాన్ జయంతి

ఏన్కూరు: మండలంలోని హిమామ్‌నగర్ పంచముఖ అంజనేయస్వామి దేవాలయంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు చైర్మన్ కొర్ర శంకర్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాల్సిందిగా కోరారు.

కాసేపు చెట్టు నీడలో..



రోడ్డుపై చెట్టు నీడన సేద తీరుతున్న గోవులు

తల్లాడ: ఆవులు, ఎద్దులు మేతకోసం పొలాలకు వెళ్లి మేత మేస్తుంటాయి. కానీ మండిపోతున్న ఎండలకు తట్టుకోలేక దేవరపల్లి–వరంగల్ జాతీయ రహదారిలో తల్లాడ రింగ్ రోడ్డు సెంటర్‌కు కల్లూరు రోడ్డులో పెద్ద వృక్షాల నీడన సేద తీరుతున్నాయి. జాతీయ రహదారి అయితేనేమి వచ్చేపోయే వాహనాలు మమ్ములను తప్పించికొని పక్కనుంచే వెళ్తాయి. ఇలా పశువులు రోడ్డుపై నీడన ఆగటంతో ఎండాకాలంలో ఈ ఏడాది ఎండ తీవ్రత ఎంత ఉందో అర్ధమౌతుంది.

ఇలా పశువులు రోడ్డుపై ఆగినప్పుడు జాతీయ రహదారిలో ఒక్కోసారి ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. ఈ దృశ్యాన్ని పలువురు ఆశ్చర్య కరంగా తిలకించారు.

ఎండ చంపుతోంది..

- ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి
- ఉదయం 8 నుంచే సూర్య ప్రతాపం
- వడదెబ్బకు గురవుతున్న కూలీలు
- జాగ్రత్తలు పాటించాలని వైద్యుల సూచనలు

ముదిగొండ: గత పది రోజుల నుంచి భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. ఉదయం 8 గంటలనుంచే విపరీతమైన వేడి గాలులు తోలుతున్నాయి. మధ్యాహ్నం బయటకు రావాలంటే భయపడే పరిస్థితిలో ఉష్ణోగ్రతలున్నాయి. ముఖ్యంగా ఉపాధి పనులకెళ్లే వారు, కూలీలు వడదెబ్బకు గురౌతున్నారు. వీరంతా నీరసించి పోతున్నారు. రోజు 4,500 మంది కూలీలు వివిధ పనులు నిమిత్తం పని చేస్తున్నారు. ఎండ నుంచి రక్షణకు తీసుకోవాలసిన జాగ్రత్తలపై వీరికి అవగాహన లేక పోవడం, సరైన వసతులు లేకపోవడంతో జనం వడ దెబ్బ బారీన పడుతున్నారు. ఎండలు తీవ్రతతో రహదారులు నిర్మానుషంగా మారాయి. ప్రజలు బయటకు రావడానికి బయపడుతున్నారు.


మండుటెండలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు ముఖాలకు దుస్తులు కట్టుకుని ప్రయాణిస్తున్నారు. దప్పిక తీర్చుకోవడానికి రకరకాలైన కూల్ డ్రింక్స్, నిమ్మరసం కొబ్బరి బోండాలను సేవిస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వడ దెబ్బ నివారణకు చర్యలు తీసుకుంటున్న దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు అధికారులు పేర్కొన్న సిబ్బంది ఆచరణలో పెట్టడం లేదు. ఇంకా నెల రోజులు పాటు ఉష్ణోగ్రతలు మరింత అధికంగా పెరగవచ్చునని భావిస్తున్నారు. గ్రామాల్లో యువకులు వేసవి తాపాన్ని తట్టుకోలేక బావుల్లో ఈతలు కొడుతున్నారు. ఇళ్లల్లో వేడి గాలికి ఉండలేక పచ్చని చెట్లకిందకు చేరుతున్నారు. ఎండకు తట్టుకోలేక అడువుల్లో పశువులు చెట్ల కిందకు చేరుతున్నాయి. వృద్ధులు, చిన్నారులు అతలాకుతలం అవుతున్నారు.

అవసరమైతేనే బయటకు రావాలి..



ప్రజలు వడగాలులకు అత్యవసరమైతేనే ఇళ్లల్లోనుంచి బయటకు రావాలి, వచ్చినా నెత్తికి క్యాపు, కళ్లకు కూలింగ్ అద్దాలు, పలుచని దుస్తులు ధరించాలని, వెంట మంచీనీటితో పాటు ఉచితంగా అందజేసే ఓఆర్ఎస్ ప్యాకెట్లతో పాటు నిమ్మరసం, మజ్జిగలాంటివి ఎక్కువ తీసుకోవాలి. చిన్నపిల్లలు, వృద్ధులు బయటకు రానివ్వద్దు. అవసరం మేరకు వైద్యుల సలహాలు పాటించాలి.

– అరుణాదేవి, పీహెచ్‌సీ వైద్యాధికారిణి, ముదిగొండ